


### పులిచింతల నీటి నిల్వ


అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.9635 టీఎంసీలు. ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.



### సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 2216 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. పలు కాల్వలకు 1920 క్యూసెక్కులు వదిలారు.

### కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

## న్యూస్‌రీల్

### నేడు ఎయిమ్స్ ఐదో వార్షికోత్సవం

మంగళగిరి: నగర పరిధిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఐదో వార్షికోత్సవం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఆసుపత్రి ఆవరణలోని ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కె.జవహర్ రెడ్డి, అతిథులుగా డాక్టర్ వేమూరి మూర్తితో పాటు పలువురు అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

### రిపబ్లిక్ డే వేడుకలకు విజ్ఞాన్ విద్యార్థులు



కేశవ్‌కుమార్ రాయ్




మహ్మద్ షమా పర్వీన్

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన ఇరువురు విద్యార్థులు న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్ వేడుకలు వీక్షించేందుకు ఎంపికయ్యారని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కార్యాలయం సోమవారం తెలియజేసింది. దేశంలోని అన్ని యూనివర్సిటీల్లో మంచి ప్రతిభ చూపిన 50 మంది విద్యార్థులకు దేశ ప్రధానమంత్రితో కలిసి రిపబ్లిక్ డే వేడుకలను కర్తవ్యపథ్‌లోని ప్రధానమంత్రి బాక్స్ నుంచి చూసే అవకాశం ఉంటుంది. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి విజ్ఞాన్ యూనివర్సిటీకు చెందిన కేశవ్ కుమార్ రాయ్ (బీటెక్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ 9.87 సీజీపీఏతో గోల్డ్ మెడల్), మహ్మద్ షమా పర్వీన్ (ఎంటెక్‌లోని అన్ని బ్రాంచ్‌లలో కెల్లా ఉత్తమ సీజీపీఏతో గోల్డ్ మెడల్)లు మాత్రమే ఉన్నారని తెలియజేసింది. రిపబ్లిక్ డే వేడుకలను వీక్షించేందుకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులను చైర్మన్ లావు రత్తయ్య, వీసీ పి.నాగభూషణ్ తదితరులు అభినందించారు.

### 11న నవోదయ ప్రవేశ పరీక్ష

చిలకలూరిపేటటౌన్: నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారు హాల్ టికెట్లు నవోదయ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11తేదీ నిర్వహిస్తున్నట్లు, హాల్‌టికెట్లను రిజిస్ట్రేషన్ నంబర్ లేదా పుట్టినతేదీ ఎంటర్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సాంకేతిక కారణాలతో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ కానివారు నేరుగా మండలంలోని మద్దిరాల నవోదయ విద్యాలయంలో సంప్రదించాలని కోరారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 31తేదీ చివరి తేదీ అని, ఈ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని గుర్తు చేశారు.

### జోరుగా మిర్చి క్రయవిక్రయాలు



కొరిటిపాడు(గుంటూరు): మిర్చి క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. ఈ సీజన్‌లో ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంతగా సోమవారం రైతులు 1,07,429 బస్తాలు యార్డుకు తరలించారు. ఈ–నామ్ ద్వారా 98,686 బస్తాలు విక్రయాలు జరిగాయి. మిర్చి ధరలు ప్రస్తుతం స్థిరంగా ఉండటంతో రైతులు అమ్మకాలకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొత్త సరుకు యార్డుకు ఇప్పుడిప్పుడే వస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు కర్నూలు, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి వచ్చే మిర్చి అంత నాణ్యతగా ఉండటం లేదు. తాలు ఎక్కువగా వస్తుంది. అందుకే రైతులు నిల్వ పెట్టడం కంటే అమ్ముకునేందుకే మొగ్గు చూపుతున్నారు. మరీ తడిగా ఉన్న మిర్చిని యార్డుకు తీసుకువస్తున్నారని, ఫలితంగా ధరలపై ప్రభావం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఆరబెట్టి యార్డుకు తీసుకువస్తే ఆశించిన ధర వచ్చే అవకాశం ఉందని సూచిస్తున్నారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు రూ.8,000 నుంచి రూ.26,000 వరకు ధర పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు రూ.8,000 నుంచి రూ.26,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 43,886 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

# జన సంక్షేమం సీఎం జగన్ లక్ష్యం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలక వర్గం



ప్రమాణ స్వీకార మహోత్సవంలో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని

**ఏఎంసీ ప్రమాణ స్వీకార మహోత్సవంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని**

గురజాల: సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటినుంచి సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుని, పేద ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేశారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో గురజాల – దాచేపల్లి మార్కెట్ యార్డు నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి విడదల రజని మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్న నాయకుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారన్నారు. వెనుకబడిన పల్నాడు ప్రాంతాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. మెడికల్ కళాశాలను రూ.500 కోట్ల వ్యయంతో నిర్మాణం చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రజలను చిన్న చూపు చూస్తూ కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని, కానీ నేడు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ వారి ఎదుగుదలకు పాటుపడే విధంగా ప్రణాళికలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ అధికారం శాశ్వతం కాదని, మనం చేసే మంచి పేరు శాశ్వతంగా నిలుస్తుందని నమ్మిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. పల్నాడుకు మణిహారంగా మారిన మెడికల్ కళాశాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను మెచ్చుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు పదవులు కేటాయించడం ఆత్మగౌరవానికి ప్రతీకగా అభివర్ణించారు. వారికి 50 శాతం రిజర్వేషన్ కల్పించి ప్రతి ఒక్కరికీ పదవులు వచ్చే విధంగా కృషిచేసిన నాయకుడిగా సీఎం వైఎస్ జగన్ చరిత్రలో నిలుస్తారన్నారు. గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి తదితరులు మాట్లాడారు.

**వైభవంగా ప్రమాణస్వీకారం**

గురజాల–దాచేపల్లి మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. మార్కెట్ యార్డు చైర్మన్‌గా కలకండ ఆంద్రెయ్య, వైస్ చైర్మన్‌గా తగుళ్ల పెద పిచ్చయ్య, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. వీరిచే మార్కెట్ యార్డు కార్యదర్శి ప్రమాణ స్వీకారం చేయించారు. తనకు మార్కెట్ యార్డు చైర్మన్‌గా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలకు రుణపడి ఉంటానని నూతన చైర్మన్ తగుళ్ల ఆంద్రెయ్య తెలిపారు. తొలుత పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నూతన పాలకవర్గ సభ్యులను ఘనంగా దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, గుంటూరు మార్కెట్‌యార్డు చైర్మన్ సీహెచ్ ఏసురత్నం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, మండల కన్వీనర్ ఎస్.గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

### జగనన్న గృహాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్

గుంటూరు ఈస్ట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గృహనిర్మాణ పథకంలో భాగంగా ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఉచితంగా ఇస్తున్నట్లు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ మురళీకృష్ణ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక కిలోవాట్ విద్యుత్ వరకు కనెక్షన్ ఉచితంగా ఇస్తున్నామన్నారు. దీనికి లబ్ధిదారులు వారి హౌస్ ఎలాంట్‌మెంట్ లెటర్, ఆధార్ జిరాక్స్ కాపీ, ఫొటోలు దరఖాస్తుతో జత చేయాలన్నారు. సంబంధిత ఏఈ కార్యాలయాల్లో సంప్రదించి ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కొందరు లబ్ధిదారులు తెలియక సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో రుసుము చెల్లిస్తున్నారని, చెల్లించాల్సిన అవసరం లేదని వివరించారు. లబ్ధిదారులకు సర్వీసు వైరు, మీటరు బోర్డు, ఎన్‌సీసీబీ, ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

### అప్రమత్తతే రక్ష

డీటీసీ షేక్ కరీమ్

మంగళగిరి: వాహనచోదకులు డ్రైవింగ్ చేస్తున్న క్రమంలో అప్రమత్తంగా వ్యవహరించాలని డీటీసీ షేక్ కరీమ్ కోరారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం మంగళగిరి – తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని కాజ టోల్‌ప్లాజా వద్ద స్వచ్ఛత పక్వాడ–2023 కార్యక్రమంలో భాగంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను ఆపి తనిఖీలు చేపట్టి డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మంగళగిరి ఎంవీఐ విజయ సారధితో పాటు జిల్లాకు చెందిన పలువురు రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సమస్యలపై సత్వర ‘స్పందన’

- జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్
- స్పందనలో 153 వినతులు



స్పందనలో బాధితుల సమస్యను వింటున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి, పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన ప్రజాసమస్యల పరిష్కార వేదిక హాలులో సోమవారం ప్రజల నుంచి 153 సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం వరకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, డీఆర్వో వినాయకంలకు చెప్పుకొని పరిష్కరించాలని విన్నవించారు. ప్రజా సమస్యలను సావధానంగా విన్న వారు సంబంధిత జిల్లా అధికారులకు పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 153 మంది అర్జీలు అందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వచ్చిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా దివ్యాంగులకు సదరం ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. స్పందన కార్యక్రమమానికి తరలివచ్చిన ప్రజలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ నిర్వాహకులు ఉచిత భోజన వసతులను కల్పించారు. దాతలను జిల్లా కలెక్టర్ అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా, రెవెన్యూ, మండల అధికారులు పాల్గొన్నారు.

### సమస్య పరిష్కరించకుంటే ఆత్మహత్యే శరణ్యం..



తమ పొలానికి వెళ్లే డొంకదారిలో పట్టాలు ఇవ్వటంతో తాము అక్కడికి వెళ్లేందుకు పట్టాదారులు అనుమతి ఇవ్వట్లేదని, సమస్యను పరిష్కరించమని అధికారులకు విన్నవించుకున్నా పరిష్కారం లభించలేదని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇప్పటికైనా సమస్యను పరిష్కరించకపోతే పురుగుమందు సేవించి ప్రాణాలు తీసుకుందామని డబ్బా కూడా తెచ్చుకున్నామంటూ కారంపూడికి చెందిన ముత్యాలంపాటి మల్లికార్జునరావు, పద్మ దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తూ కలెక్టరేట్ ముందు కూర్చొని ఆందోళన చేశారు. అధికారులు గమనించి వారివద్దనున్న పురుగుమందు డబ్బాను స్వాధీనం చేసుకున్నారు. కలెక్టరేట్ ఏఓ అనీల్‌కుమార్ హుటాహుటిన వారి వద్దకు వచ్చి విషయం తెలుసుకొని కారంపూడి రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఈ అంశం ఉందని తెలియటంతో ఆయన వారికి నచ్చచెప్పి జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. విషయం విన్న కలెక్టర్ మీకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో వారు శాంతించారు.

# విజేఈఈ భవ!

ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ చదవాలనే విద్యార్థుల కలకు తొలిమెట్టు మొదలు కానుంది. దేశంలోనే ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ విద్యా సంస్థలైన ఐఐటీ, ఎన్‌ఐటీలలో ప్రవేశ పరీక్షల అంకం నేటినుంచి మొదలుకానుంది. ఆన్‌లైన్‌లో రెండు సెషన్లుగా జరిగే జేఈఈ మెయిన్ పరీక్షకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 8 కేంద్రాలను ఎన్‌టీఏ సిద్ధం చేసింది.

- నేటి నుంచి జేఈఈ మెయిన్
- ఈనెల 24, 25, 28, 29, 30, 31, ఫిబ్రవరి 1వ తేదీ వరకు నిర్వహణ
- ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో ఆన్‌లైన్ సెషన్లు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎనిమిది పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 9,500 మంది విద్యార్థులు



గతేడాది జేఈఈ మెయిన్‌కు హాజరవుతున్న విద్యార్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశానికై నిర్వహించే జేఈఈ మెయిన్ మొదటి సెషన్ పరీక్షలు మంగళవారం నుంచి జరగనున్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పేపర్–1, పేపర్–2 విధానంలో జరగనున్న బీఈ, బీటెక్, బీఆర్క్, ప్లానింగ్ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా దరకాస్తు చేసిన 9,500 మంది విద్యార్థులకు వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరగనున్న ఆన్‌లైన్ పరీక్షలకు సంబంధించిన మార్గదర్శకాలను విద్యార్థులకు అడ్మిట్‌కార్డుతో పాటు అందజేసిన ఇన్ఫర్మేషన్ బుక్‌లెట్‌లో పొందుపర్చారు. ఈనెల 24, 25, 28, 29, 30, 31తో పాటు ఫిబ్రవరి 1వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

**అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఆసన్నం..**

ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించే లక్ష్యంతో విద్యా సంవత్సరం పొడవునా సన్నద్ధమవుతున్న విద్యార్థులు పరీక్షలు జరిగే రోజున ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైంది.

- జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణలో ఎన్‌టీఏ విధించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సి ఉంది.
- ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పేపర్–1 పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులను ఉదయం 7 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. తదుపరి ఉదయం 8.30 గంటలకు విద్యార్థులను అనుమతించడం నిలిపివేస్తారు.
- మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనున్న పేపర్–2 పరీక్షకు విద్యార్థులను మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకే అనుమతిస్తారు. పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని తప్పక తెలుసుకోవాలి.
- పరీక్షా కేంద్రాల్లోకి వెళ్లిన తరువాత ఆన్‌లైన్ పరీక్షకు సంబంధించి ఇన్విజిలేటర్లు అందించే సూచనలతో పాటు నియమ, నిబంధనలు తెలుసుకునేందుకు అరగంట సమయాన్ని కేటాయించిన కారణంగా విద్యార్థులను పరీక్షా సమయానికి అరగంట ముందు వరకే అనుమతించాలని ఎన్‌టీఏ మార్గదర్శకాల్లో పొందుపర్చింది. ఉదయం 9.00, మధ్యాహ్నం 3 గంటలకు ఖచ్చితంగా పరీక్ష ప్రారంభమవుతుంది.

# జీఎన్ఎం పరీక్షలు ప్రారంభం

గుంటూరు మెడికల్: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం) వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు వైద్య కళాశాలలో జిల్లావ్యాప్తంగా పలు నర్సింగ్ పాఠశాలలకు చెందిన 1474 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. తొలిరోజు పరీక్షకు 1330 మంది హాజరుకాగా, 144 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల చీఫ్ ఎగ్జామినర్‌గా గుంటూరు జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, అబ్జర్వర్‌గా అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రావణ్‌కుమార్‌లు వ్యవహరించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఫిబ్రవరి 1 వ తేదీ వరకు థియరీ పరీక్షలు, ఫిబ్రవరి 2 నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని చీఫ్ ఎగ్జామినర్ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్ తెలిపారు.

# వేగం కన్నా ప్రాణం మిన్న

కలెక్టర్ శివశంకర్



రహదారి భద్రతా నియమాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: రహదారి భద్రతా నియమాలను పాటించటం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో సోమవారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పల్నాడుజిల్లా అభివృద్ధి మండలి చైర్మన్ మిట్టపల్లి రమేష్‌బాబు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సదస్సులో కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ, వేగం కన్నా ప్రాణం ముఖ్యమనే విషయం వాహనదారులు గుర్తుంచుకోవాలన్నారు. మితిమీరిన వేగంతో ఎందరో ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కాగా, సదస్సుకు హాజరైన డ్రైవర్లకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రారంభించారు. హాజరైన డ్రైవర్లకు డాక్టర్ గోపిరెడ్డి వైద్యపరీక్షలు నిర్వహించి తగిన సూచనలు అందించారు. సదస్సులో డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. రహదారి భద్రతా నియమాలు పాటిస్తామని డ్రైవర్లచే ప్రమాణం చేయించారు. ఈసందర్భంగా ఇప్పటివరకు ఎటువంటి ప్రమాదాలు లేకుండా వాహనాలను నడిపిన ఆరుగురు డ్రైవర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎం.శివనాగేశ్వరరావు, బి.సత్యనారాయణప్రసాద్, ఎస్.శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

# గుం‘టూరు’ వచ్చిన ప్రపంచ పర్యాటకురాలు



ఇటలీ దేశస్తురాలు ఎలీనా ఎగ్గీనాకు స్పేస్ సైన్స్ పుస్తకాన్ని బహూకరిస్తున్న దీపక్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ పర్యటనలో ఉన్న ఇటలీ దేశస్తురాలు ఎలీనా ఎగ్గీనా సోమవారం గుంటూరు నగరానికి వచ్చారు. గత మూడున్నరేళ్లుగా బైక్‌పై 28 దేశాలను సందర్శించిన ఆమె ప్రస్తుతం భారతదేశంలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా చెన్నై నుంచి వైజాగ్ వెళ్తూ మార్గ మధ్యలో గుంటూరు పండరీపురంలోని పులుగు దీపక్ నీట్, జేఈఈ ఉచిత శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో మమేకమై మహిళా సాధికారతపై మాట్లాడారు. విద్యార్థినులు విద్యావంతులుగా ఆకాశమే హద్దుగా ఎదగాలని సూచించారు. తన పర్యటన విశేషాలను వివరిస్తూ బైక్‌పై మూడున్నరేళ్ల క్రితం మొదలైన తన ప్రపంచ యాత్ర ఇప్పటికి 28 దేశాల్లో ఎక్కడా ఒక్క హోటల్‌లో బస చేయకుండా, నిరంతరం కొనసాగడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. విభిన్న సంస్కృతులు, భిన్నమైన ప్రదేశాలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానాలిచ్చారు. ఎలీనాను సత్కరించిన శిక్షణా కేంద్ర నిర్వాహకుడు పులుగు దీపక్ భారతదేశ గొప్పతనాన్ని వివరించే స్పేస్ సైన్స్ పుస్తకాన్ని బహూకరించారు. గుంటూరులో తనకు లభించిన ఆదరణ, ఆత్మీయ స్వాగతంపై ఎలీనా ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# రైతులకు ఎరువులు, పురుగుమందులు అందజేయండి

సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎంపీ లావు




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు, వేదికపై జిల్లా కలెక్టర్ శివశంకర్, జిల్లా వ్యవసాయాధికారి మురళి

నరసరావుపేట: జిల్లాలో రబీసీజన్‌లో రైతులు సాగుచేస్తున్న పంటలకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, ఎరువులు, పురుగు మందుల కంపెనీల ప్రతినిధులతో పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణదేవరాయలుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఐ.మురళి జిల్లాలో సాగవుతున్న పంటల రకాలు, సాగు చేస్తున్న రైతులు, పంటల విస్తీర్ణం, పంటలు దిగుబడి, రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఎంపీ లావు మాట్లాడుతూ ఇటీవలకాలంలో చాలామంది రైతులు తాము పడుతున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకురావటంతో జిల్లా కలెక్టర్‌కు తెలియచేయటం జరిగిందన్నారు. జిల్లాలో ఎంతమేర పంటల సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అవసరముందో నివేదిక రూపంలో తెలియజేయాలని ఎంపీ కోరారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయని, రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి అత్యధిక పంట దిగుబడులు పొందవచ్చన్నారు. రాబోయే ఖరీఫ్ నాటికి ముందే రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఈ మేరకు అందుబాటులో ఉంచగలరో వివరాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## ఉపాధి హామీ పనుల్ని పరిశీలించిన రాష్ట్ర బృందం



నరసరావుపేట రూరల్: మండలంలోని అల్లూరివారిపాలెంలో ఉపాధి హామీ పనుల్ని రాష్ట్ర బృందం సోమవారం పరిశీలించింది. బృందం సభ్యులు స్వరూప, నాగరాజు పర్యటించారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో కూలీలతో మాట్లాడారు. వారికి అందుతున్న వేతనం గురించి అడిగి తెలుసుకున్నారు. కూలీల జాబ్ కార్డ్స్, మస్టర్స్‌ను పరిశీలించారు. పథకం కింద గ్రామంలో సాగవుతున్న జామ తోటల్ని పరిశీలించి, దిగుబడులపై రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంతో రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీవో కట్టా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఇప్పటంలో అభివృద్ధి పనులు ప్రారంభం

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని ఇప్పటంలో సోమవారం అభివృద్ధి పనులు ప్రారంభించారు. ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ప్రహరీలను కార్పొరేషన్ అధికారులు నోటీసులు ఇచ్చి తొలగిస్తుంటే టీడీపీ, జనసేన కోర్టుకు వెళ్లాయి. అయితే, కోర్టు వారికి రూ.లక్ష చొప్పున అపరాధ రుసుం కట్టాలని కోర్టుకు వెళ్లిన 18 మందిని న్యాయస్థానం ఆదేశించింది. అడ్డంకులు తొలగిపోవడంతో ముందుగా రోడ్డుకు ఇరువైపులా రూ. 56 లక్షలతో 540 మీటర్ల పొడవునా రెండు అడుగుల వెడల్పుతో డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు.



## పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి

- ప్రభుత్వ విప్ పీఆర్కే
- తుమ్మకోటకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక



తుమ్మకోట గ్రామస్తులకు వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా కృషి చేయాలని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని తుమ్మకోటలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మిద్దెపోగు ఇమానేయులు, మిద్దెపోగు లాజరు, మిద్దెపోగు సామ్యేలు, కర్రా యోహను, కటికల ఏసయ్య, ఆలేటి ఇసాకు, ఆలేటి దానయ్య, పేరువాళ్ల బద్రి, ఆలేటి దావీదు, వేల్పుల క్రిస్మస్‌రావు, కందుకూరి రామారావు, మిద్దెపోగు సందీప్, వేల్పుల ప్రసాద్ తదితరులకు సోమవారం వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పీఆర్కే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామంలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందచేస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉన్నా అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని అవసరమైతే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. 2024 సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా మనమందరం ముందుకు పోవాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు అందచేస్తున్న సంక్షేమ పథకాల వలన వారి కుటుంబాలలో ఎంతమేర లబ్ధిచేకూరిందో ప్రజలలోకి తీసుకునిపోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కర్రా సత్యానందం, పొట్టిపోగు లాజరు, కర్రా మిఖైల్, కర్రా సుందరరావు పాల్గొన్నారు.

## జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జీవ రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను శనివారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదస్సు డైరెక్టర్ ఆచార్య జె. రాజశేఖర్ మాట్లాడుతూ 'జీవరసాయన శాస్త్రంలో సాంకేతిక అభివృద్ధి' అనే అంశంపై ఫిబ్రవరి 13, 14 తేదీల్లో యూజీసీ సౌజన్యంతో జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి ఆచార్య ఎన్. వెంకట ప్రసూజ కోశాధికారిగా వ్యవహరించనున్నారని ఆయన చెప్పారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా పలు యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థల నుంచి అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, నిపుణులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. కిరణ్మయి, మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య కె.వి. శాంతిశ్రీ పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు

- ఎస్సీల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరిన ఎస్సీలు

పిడుగురాళ్ల: ఎస్సీల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సోమవారం మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో మండలంలోని పాతగణేశునిపాడు గ్రామానికి చెందిన ఎస్సీలు తెలుగు బాప్టిస్టు చర్చి సంఘ కాపరి జయరావు సమక్షంలో భారీగా చేరారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమని చెప్పారు. నవరత్నాలు, నియోజకవర్గ అభివృద్ధిని చూసి భారీగా ఇతర పార్టీలకు చెందిన వారు చేరుతున్నారని వివరించారు. మండలంలోని పాతగణేశునిపాడు గ్రామానికి చెందిన 150 మంది చేరారు. వీరందరికి మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ కండువాను మెడలో వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పాతగణేశునిపాడు సర్పంచి మేకల శ్రీనివాసరావు, ఉప సర్పంచి శివ, సచివాలయ కన్వీనర్ షేక్ బాషా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎండీ గఫార్, పట్టణ, మండల కన్వీనర్లు చింతా వెంకట రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, ఉన్నం శ్రీనివాసరావు, ఎండీ అలీం, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, మీసాల శ్రీను, సత్యాల యోసోబు, గుళ్లపల్లి లాజరు, మహేష్, బొల్లాపల్లి సాగర్, ఎం.హనుమయ్య, యాకోబు, ముద్దా రామయ్య, సంగిపోగు శేఖర్, పాడిచర్ల తిరుపతిరావు, చంద్రం, ప్రసన్న పార్టీలో చేరారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

నరసరావుపేట టౌన్: భార్య అనారోగ్యంతో మృతి చెందేందుకు సోదరుడే కారణమని నమ్మి మద్యం మత్తులో అతడ్ని కత్తితో పొడిచి చంపిన కేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓపీ నాగేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం.. వినుకొండ నియోజకవర్గం బండ్లమోటు పోలీసుస్టేషన్ పరిధిలోని లాలిపురం తండాలో గతేడాది ఫిబ్రవరి 22వ తేదీ రాత్రి అన్న వరుసైన జరపన శ్రీనూ నాయక్‌ను సక్రియా నాయక్ కత్తితో పొడిచి చంపాడు. ఈ మేరకు శ్రీనూ నాయక్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పలువురు సాక్షుల్ని విచారించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావటంతో శిక్ష, జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్‌ను పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.బాలా హనుమంతారెడ్డి నిర్వహించగా, బండ్లమోటు పోలీసులు దర్యాప్తు చేశారు.

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి
- స్పందనలో 72 ఫిర్యాదుల స్వీకరణ



స్పందనలో సమస్యను వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి 72 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు సి.విజయభాస్కరరావు, జయరాంప్రసాద్, యు.రవిచంద్ర, సీఐ సుభాషిణి పాల్గొన్నారు.

**రక్షణ కల్పించండి**

అద్దె ఇంటిని ఖాళీ చేయించి తన బంధువులకు ఇచ్చేందుకు తనతో పాటు పక్క పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న ఓ వ్యక్తి, అతడి బంధువులు నన్ను, నా భర్తను దారుణంగా కొట్టారు. దెబ్బలు తగిలి హాస్పిటల్ పాలయ్యాం. పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే వారు కూడా నీ మీద ఫిర్యాదు చేశారు.. రెండు ఫిర్యాదులు కట్టమంటారా అంటూ ఎస్ఐ చెబుతున్నారు. మాపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసి మాకు రక్షణ కల్పించండి.

–షేక్ ఆషాబి, వెంకటచారినగర్, చిలకలూరిపేట.

## ప్రభుత్వానికి రైతులు, వ్యాపారులు రెండు కళ్లు

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- మిర్చి యార్డులో దిగుమతి సంఘం కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల

కొరిటిపాడు(గుంటూరు): రైతులు, వ్యాపారులు రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తూ ఇద్దరికీ సమన్యాయం చేస్తూ సుపరిపాలన చేస్తోందని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. ఓ వైపు రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూనే మరోవైపు వ్యాపారుల సంక్షేమంపై పూర్తి చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గుంటూరు మిర్చి యార్డులో రైతులు, వ్యాపారులకు వెన్నుదన్నుగా మరింత సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. మిర్చి యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన గుంటూరు చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ దిగుమతి సంఘం నూతన కార్యాలయాన్ని ఏఎంసీ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నంతో కలసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ కార్యాలయం గతంలో పట్నంబజారులో ఉండేదని, ఫలితంగా రైతులు, వ్యాపారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ఇకపై ఆ పరిస్థితి లేకుండా, అందరికీ అందుబాటులో ఉండే రీతిలో మార్కెట్ యార్డు ఆవరణలోనే ఏర్పాటు చేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు. మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ యార్డును మరింత ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై సమగ్రంగా చర్చించి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుంటామని తెలిపారు. దిగుమతి సంఘం అధ్యక్షుడు లేళ్ల పెద్ద అప్పిరెడ్డి మాట్లాడుతూ అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, దిగుమతి సంఘం మాజీ అధ్యక్షుడు కుర్రి సాంబిరెడ్డి, వ్యాపారులు కె.వేణుగోపాల్, టి.నారాయణ, శ్రీనివాసరెడ్డి, రాఘవరావు, టి.రామారావు, డి.నరేంద్రబాబు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: జిల్లాలో తొలిసారిగా నిర్వహించనున్న గణతంత్ర వేడుకలు వైభవంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన అన్ని శాఖల జిల్లా అధికారులతో సోమవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గణతంత్ర వేడుకలు జిల్లా ప్రగతిని ప్రతిబింబించేలా నిర్వహిద్దామని చెప్పారు. నరసరావుపేట పట్టణం డీఎస్ఏ స్టేడియం మొత్తం విద్యుత్తు వెలుగులు, ప్రభుత్వ శాఖలకు చెందిన అన్ని రకాల శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యోగులు, సామాజిక సేవా రంగాలకు చెందిన వారికి అవార్డులు, మైక్ అండ్ లైటింగ్, బారికేడ్లు, సభా వేదిక అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని చెప్పారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వేడుకలను ఉండాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు, ఉద్యోగులు అంతా తప్పని సరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## వైభవంగా పునీత మరియ జోజప్ప చర్చి వసంతోత్సవం

హాజరైన బిషప్ చిన్నబత్తిని భాగ్యయ్య



మాట్లాడుతన్న బిషప్ చిన్నబత్తిని భాగ్యయ్య

నాదెండ్ల: కనపర్రులోని పునీత మరియ జోజప్ప చర్చిలో కల్యాణ నిశ్చితార్థ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. చర్చి నిర్మించి 125 వసంతాలు పూర్తి అయినా సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య హాజరయ్యారు. స్థానిక విచారణ గురువు పగడాల చిన్నప్ప ఆధ్వర్యంలో ఉదయం సమిష్టి దివ్య పూజాబలి నిర్వహించారు. కానుకలు, కొవ్వొత్తులు సమర్పించారు. రాత్రి తేరు ఊరేగింపుతో పాటూ యువత బాణసంచా కాలుస్తూ తీన్‌మార్ వాయిద్యాలతో సందడి చేశారు. చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బిషప్ భాగ్యయ్య మాట్లాడుతూ నీతివంతుడైన యోసేపు కన్యయైన మరియను భార్యగా స్వీకరించిన గుర్తుగా ప్రతి ఏటా కల్యాణ నిశ్చితార్థం నిర్వహించటం సంతోషకరమన్నారు. గ్రామంలో అనేక మంది గురువులు, కన్యకాస్త్రీలు ఉండి ఆధ్యాత్మిక, సామాజిక సేవలందిస్తున్నారన్నారు. ఆధ్యాత్మికమైన దాంపత్య జీవితానికి భక్తుల విశ్వాసం పొందుతున్నారని చెప్పారు. ప్రతి ఏటా జనవరి 23న జరుగుతున్న కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి దేశ విదేశాలు, వ్యాపార, వృత్తులు, ఉద్యోగాల్లో ఉన్న వారంతా హాజరుకావటంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భారీ అన్నదానం నిర్వహించారు.

## గ్రామీణ క్రీడా మాణిక్యానికి ఆర్థిక సాయం



ధనలక్ష్మికి చెక్కు అందజేస్తున్న విశ్వతేజ నూలు మిల్లు మేనేజింగ్ డైరెక్టర్లు

యడ్లపాడు: పల్నాడు జిల్లా యడ్లపాడు ఎస్సీ కాలనీకి చెందిన కోడిరెక్క ధనలక్ష్మి ఖోఖో, పరుగు, వాలీబాల్, షూటింగ్ తదితర విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపుతోంది. రాష్ట్ర స్థాయిలో సైతం ప్రథమ, ద్వితీయ స్థానాల్లో పలు బహుమతులు గెలుచుకుంది. ఈ నేపథ్యంలో ఈనెల 21న ఆమె క్రీడా ప్రతిభ పాటవాలపై 'సాక్షి' దిన పత్రికలో 'క్రీడా ధనలక్ష్మి' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇది దాతల హృదయాన్ని కదిలించింది. త్వరలోనే షూటింగ్ బాల్‌లో ఇండియా తరపున అంతర్జాతీయ స్థాయి పోటీలకు హాజరుకానున్న ధనలక్ష్మికి రూ. 55వేలు చెక్కును యడ్లపాడు మండలం బోయపాలెంలోని విశ్వతేజ నూలుమిల్లు ఎండీ దాసరి చంద్రశేఖర్, కాకపర్తి రమేష్, దాసరి వెంకట శివనాగకుమార్ అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారిణి ధనలక్ష్మి తల్లి కోడిరెక్క అన్నమ్మ, మిల్లు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్కంఠగా ఒంగోలు ఎడ్ల బలప్రదర్శన పోటీలు

- హాజరైన జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎంపీ లావు, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- మొదటిరోజు విజేతలకు బహుమతులు అందజేత



రెండు పళ్ల గిత్తల విభాగంలో పాల్గొనేందుకు వచ్చిన ఎద్దుల యజమానికి షీల్డు, గిఫ్ట్ ప్యాక్ అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట డీఎస్ఏ స్టేడియంలో గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్ ఒంగోలు జాతి వృషభరాజముల బండ లాగుడు బలప్రదర్శన పోటీలు సోమవారానికి రెండోరోజుకు చేరాయి. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు సంబరాల్లో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆదివారం మొదటిరోజు నిర్వహించిన పాలపళ్ల విభాగంలో విజేతలైన వారికి నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో మొదటి విజేతగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన వల్లభనేని మోహనరావు ఎడ్ల జత గెలుపొందగా, రెండో బహుమతిని నరసరావుపేట మండలం ఇక్కుర్తి గ్రామానికి చెందిన మాదనబోయిన పోతురాజుయాదవ్ ఎడ్లు, మూడో బహుమతిని నాదెండ్లకు చెందిన నలమోతు వేణుగోపాలరావు ఎడ్లు గెల్చుకున్నాయి. ఈ విధంగా హాజరైన 28ఎడ్ల జతల్లో పదింటికి అవి నిర్ణయించిన సమయంలో బండలాగిన దూరాన్ని బట్టి బహుమతులను అందజేశారు. నిర్వాహక కమిటీ సభ్యులు చల్లానారపరెడ్డి, పాలిమేర వెంకటరెడ్డి, మూరే రవీంద్ర, పొనుగోటి వెంకటరావు, కనకా పుల్లారెడ్డి, లక్కు కృష్ణారెడ్డి, వంపుగుడిజాన్, గాడిపర్తి సీతయ్య పోటీలను పర్యవేక్షించగా, శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి రెఫరీలుగాను, వ్యాఖ్యాతగా రాధాకృష్ణ వ్యవహరించారు.